## 'ఆరోగ్యశ్రీ' సిఇఒగా జెసి బాలాజీ

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సిఇఒగా తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో జెసిగా ఆయన ఆదివారం బాధ్యతల నుండి రిలీవ్ అయ్యారు. తదుపరి రెగ్యులర్ జెసి నియమించే వరకు డిఆర్ఒ పెంచల కిషోర్ ఇన్‌ఛార్జి జెసిగా కొనసాగనున్నారు.

## కౌలు రైతు ఆత్మహత్య


నీలకంఠారెడ్డి (ఫైల్)

ప్రజాశక్తి-గార్లదిన్నె

అప్పుల బాధతాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన రైతు నీలకంఠారెడ్డి (35) గతకొన్నేళ్లుగా రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వేరుశనగ, కూరగాయల పంటలు సాగు చేశారు. ఇందు కోసం దాదాపు రూ.8 లక్షల వరకు అప్పులు చేశారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావంతో పంటలు చేతికందలేదు. పెట్టుబడులు కూడా రాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. అప్పులు తీర్చలేనన్న ఆందోళనతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. నీలకంఠారెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఒపిఎస్ అమలు చేయలేదని ఉపాధ్యాయుడి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-ఉరవకొండ (అనంతపురం జిల్లా)

ఒపిఎస్ అమలు చేస్తామని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేకపోవడంతో, మనోవేదనకు గురై ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటన అనంతరంపురం జిల్లా ఉరవకొండ మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నముష్టూరు గ్రామానికి చెందిన బోయ మల్లేష్ విడపనకల్లు మండలం పాల్తూరు ఇందిరానగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఉపాధ్యాయుల పట్ల ముఖ్యమంత్రి అనుసరిస్తోన్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆదివారం ఉదయం ఐదు పేజీల లేఖను ప్రభుత్వానికి రాశారు. సిపిఎస్ రద్దు చేయలేదని, సక్రమంగా ఒకటో తేదీన వేతనాలు ఇవ్వడంలేదనే సారాంశంతో లేఖను రాసి దానిని సామాజిక మాధ్యమాల్లో ఉంచారు. 'సక్రమంగా జీతాలు ఇవ్వకపోవడంతో సకాలంలో ఇఎంఐ చెల్లించలేక అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాను. నేను వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి వీరాభిమానిని. ఆయన తనయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాడన్న నమ్మకంతో నాతో పాటు తోటి మిత్రులు, బంధువులతో జగన్‌మోహన్‌రెడ్డికి ఓట్లు వేయించాను. అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయులను నిలువునా మోసం చేశారు. పిఆర్‌సి, డిఎలు ఇవ్వకపోవడం బాధ కలిగించింది. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నా. నేను చనిపోయిన తర్వాత నాకు రావాల్సిన డిఎ, అరియర్స్ సకాలంలో అందిస్తారని కోరుకుంటున్నా' అని లేఖలో పేర్కొన్నారు. అనంతరం పెన్నఅహోబిలం వద్ద పురుగుల మందు తాగారు. బంధువులు ఆయనను అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

## సిఎం సరికొత్త నాటకం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న ఎన్నికల్లో యువత ఓట్ల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త నాటకానికి తెరతీశారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలకు కేవలం మూడు నెలల గడువు మాత్రమే మిగిలి ఉండగా గ్రూప్-1, 2 నోటిఫికేషన్ విడుదల పేరుతో సరికొత్త నాటకానికి తెరదీశారని పేర్కొన్నారు. తాను అధికారంలోకి వస్తే ప్రతియేటా జనవరిలో జాబ్ కేలండరు విడుదల చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీనిచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చి మడమ తిప్పారని విమర్శించారు. నిరుద్యోగ యువతకు గత నాలుగున్నరేళ్లుగా ద్రోహం చేసిన జగన్‌కు యువత బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉందన్నారు.

# ఐక్య పోరాటాలతో 'తపాలా'ను కాపాడుకోవాలి

- ఎన్ఎఫ్‌పిఇ గుర్తింపు తొలగింపు అన్యాయం
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ప్రజాశక్తి-మార్కాపురం (ప్రకాశం జిల్లా)

కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. ఐక్య పోరాటాలతో ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రెండ్రోజులు నిర్వహించనున్న అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్-సి, (ఎన్ఎఫ్‌పిఇ) 40వ ద్వైవార్షిక రాష్ట్ర మహాసభ ప్రకాశం జిల్లా మార్కాపురంలోని మాధవి గ్రాండ్ ఇన్‌ఫంక్షన్ హల్‌లో ఇ శంకరనాయుడు అధ్యక్షతన ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ నేటికీ మారుమూల ప్రాంతాలకు సైతం సేవలు అందిస్తున్న తపాలా శాఖను కేంద్రం ప్రయివేటీకరించాలనుకుంటోందన్నారు. ప్రయివేటీకరణ ఆలోచనను గతంలో ఎన్ఎఫ్‌పిఇ పోరాటాలతో అడ్డుకుందని గుర్తుచేశారు. మళ్లీ అదే ప్రయత్నంలో ప్రధాని మోడీ ఉన్నారని తెలిపారు. తపాలా శాఖ ప్రయివేటీకరణను ప్రజా ఉద్యమంతో అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం తపాలా శాఖలో రూ. ఐదు లక్షల కోట్ల డిపాజిట్లు ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలే ఎక్కువగా దాచుకుంటారని తెలిపారు. తపాలా శాఖ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రయివేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని విమర్శించారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ తపాలా శాఖలో తమతో ఏదైనా సమస్య తీరుతుందనుకుంటే సహకరిస్తామన్నారు. అనంతరం ఎన్ఎఫ్‌పిఇ ప్రతినిధులు, నాయకులు, తపాలా ఉద్యోగులు వందలాదిగా మార్కాపురం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్-సి కేంద్ర సంఘం నాయకులు శ్రావణ్ కుమార్, ఆర్ఎన్ శరత్‌కుమార్, అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం పోస్టుమేన్ అండ్ ఎంటిఎస్ కేంద్ర సంఘ కార్యదర్శి సిహెచ్ విద్యాసాగర్, అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం-జిడిఎస్ కేంద్ర సంఘ సహాయ కార్యదర్శి ఎం శ్రీనివాసరావు, తెలంగాణా రాష్ట్ర గ్రూప్-సి అధ్యక్షులు మహిందర్, పోస్టుమేన్ అండ్ ఎంటిఎస్ రాష్ట్ర సంఘ అధ్యక్షులు మురళీ, పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ కేంద్ర, రాష్ట్ర సంఘ నాయకులు డి మోహనరావు, కె వెంకటేశ్వర్లు, ఎన్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.


విస్తరణ పనులకు భూమి పూజ చేస్తున్న కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా

# విమానాశ్రయాలను పెంచాం

- వెయ్యేళ్ల చరిత్ర గల రాజమహేంద్రవరం దేశానికే తలమానికం
- టెర్మినల్ భవన నిర్మాణ శంకుస్థాపనలో కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

దేశంలో విమానయాన రంగాన్ని వేగవంతంగా అభివృద్ధి చేస్తున్నామని, అందులో భాగంగానే మధురపూడి ఎయిర్‌పోర్టులో రూ.347 కోట్లతో టెర్మినల్ భవనం విస్తరణకు శ్రీకారం చుట్టామని కేంద్ర విమానయాన, ఉక్కు శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. మధురపూడి విమానాశ్రయంలో టెర్మినల్ భవన విస్తరణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వెయ్యేళ్ల ఉత్సవాలు చేసుకుంటున్న రాజమహేంద్రవరం నగర సాంస్కృతిక వారసత్వం దేశానికే తలమానికమన్నారు. 2014 నాటికి దేశంలో 74 ఎయిర్ పోర్టులు ఉండగా, ఈ తొమ్మిదిన్నరేళ్లలో కొత్తగా మరో 75 ఎయిర్ పోర్టులు వచ్చాయన్నారు. దీంతో దేశంలో ఎయిర్ పోర్టుల సంఖ్య 149కి చేరిందని తెలిపారు. రానున్న కాలంలో వీటి సంఖ్య 220కి పెంచుతానన్నారు. ప్రస్తుతం మధురపూడిలో నిర్మిస్తున్న కొత్త టెర్మినల్ పాయింట్ 21.94 వేల చదరపు అడుగుల వైశాల్యం కలిగి ఉంటుందన్నారు. రద్దీ వేళల్లో 2,100 మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యం ఉంటుందని తెలిపారు. ఎయిర్‌పోర్టులో ప్రస్తుతం 18 సర్వీసులు నడుపుతున్నామని, రానున్న రోజుల్లో 25 వరకు సర్వీసులను పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, మౌలిక సదుపాయాలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపి మార్గాని భరత్‌రామ్, ఎంఎల్ఎలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ సంజీవ్ కుమార్, కలెక్టర్ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ విపత్తుగా 'మిచౌంగ్'

- ప్రధాన మంత్రికి చంద్రబాబు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మిచౌంగ్ తుపాను వల్ల రాష్ట్రంలో తీవ్ర నష్టం జరిగిందని, దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కోరారు. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ఆదివారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో 15 జిల్లాల్లో తుపాను తీవ్ర ప్రభావం చూపిందని తెలిపారు. 100 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులు ప్రజల జీవనాన్ని దెబ్బతీశాయని, ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని వివరించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం 22 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తెలుస్తోందని తెలిపారు.

పంట నష్టపోయిన ఆవేదనతో నలుగురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.10 వేలకోట్ల వరకు పంట నష్టం ఉంటుందని అంచనా వేశారు. పంటలతోపాటు పలుచోట్ల పశువులు చనిపోయాయని, చెట్లు విరిగిపడ్డాయని, దాదాపు 770 కిలోమీటర్ల మేర రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని వివరించారు. తాగునీరు, నీటిపారుదల, విద్యుత్, కమ్యూనికేషన్ రంగాలకు నష్టం జరిగిందని తెలిపారు. వ్యవసాయంతోపాటు ఆక్వా రంగం కూడా నష్టపోయిందని పేర్కొన్నారు. పడవలు, వలలకు నష్టం జరగడంతో మత్స్యకారులు జీవనోపాధి కోల్పోయారని వివరించారు. నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర ప్రభుత్వం ఒక బృందాన్ని పంపాలని కోరారు. జాతీయ విపత్తుగా ప్రకటిస్తే తక్షణ, మెరుగైన సహాయం బాధితులకు అందుతుందని అన్నారు.

### చేతల్లో మానవత్వం చూపండి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటల్లో కాకుండా చేతల్లో కొంచెం మానవత్వం చూపాలని చంద్రబాబు కోరారు. అనంతపురం జిల్లాలో ప్రభుత్వం పెన్షన్ నిలిపివేయడంతో గిరిజన మహిళ ఆత్మహత్యకు పాల్పడిందని ఎక్స్ (ట్విట్టర్)లో పేర్కొన్నారు. ఆంక్షల పేరుతో అంధురాలి పెన్షన్ తొలగింపు కర్కశత్వం అని అన్నారు.

# నూతన విద్యా విధానంతో పేదలకు విద్య దూరం

- సమాజ మార్పులో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలి
- యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో పిడిఎఫ్ పూర్వ ఫ్లోర్ లీడర్ బాలసుబ్రమణ్యం
- డిఎస్‌సి వెంటనే ప్రకటించాలని తీర్మానం



యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి- ఏలూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అమలు చేస్తూ పేదలకు విద్యను దూరం చేస్తోందని పిడిఎఫ్ పూర్వ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. సమాజ మార్పులో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఏలూరులోని చలసాని గార్డెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) 49వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం చివరి రోజు ఆదివారం ప్రతినిధుల సభ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ శాస్త్రీయ విద్యనందించే దిశగా మంచి బడికి పునాదులు వేయాలన్నారు. కేరళ తరహాలో మన రాష్ట్ర ప్రభుత్వం కూడా అందరికీ ఉచిత నాణ్యమైన విద్య అందించాలని కోరారు. ప్రభుత్వ బడులను అభివృద్ధి చేయాలని, కార్పొరేట్ విద్యా సంస్థలపై ప్రభుత్వ జోక్యం పెరగాలని, వాటిని నియంత్రించాలని అన్నారు. నూతన విద్యావిధానం పేరుతో కేంద్రం నుండి వచ్చిన పాఠ్య పుస్తకాలనే బోధించడం తగదన్నారు. ఈ పాఠాలు వాస్తవ చరిత్రను కప్పిపుచ్చి అవాస్తవాలు విద్యార్థుల మెదడులో చొప్పిస్తున్నాయని పేర్కొన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాల వల్ల ఉపాధ్యాయ, ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని తెలిపారు. మంచి పిఆర్‌సి ఇస్తామని, సిపిఎస్ రద్దు చేస్తామని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, డిఎ బకాయిలు లేకుండా చెల్లిస్తామని ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. పాత పెన్షన్ పునరుద్ధరించకపోగా మరింత ప్రమాదకరంగా జిపిఎస్ తీసుకొచ్చారన్నారు. వీటిని ప్రశ్నిస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కార్యాచరణ రూపొందించి భవిష్యత్ పోరాటాలకు సిద్ధమవుతున్నామని తెలిపారు. సంఘం కోశాధికారి బి.గోపీమూర్తి ఆర్థిక వేదికను, ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు ఎం.కుమార్‌రాజా పత్రిక నివేదికను, ఆడిట్ కన్వీనర్ మల్లేశ్వరరావు ఆడిట్ నివేదికను, ప్రచురణ కమిటీ ఛైర్మన్ హనుమంతరావు ప్రచురణ నివేదికను, సహాధ్యక్షులు ఎ.కుసుమకుమారి మహిళా ఉద్యమ నివేదికను ప్రవేశపెట్టారు.

### పలు తీర్మానాలు ఆమోదం

డిఎస్‌సి వెంటనే ప్రకటించాలని, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ఐఆర్ ప్రకటించాలని, పాఠశాల స్థాయి పరీక్షా విధానాన్ని సమీక్షించాలని తదితర తీర్మానాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. 26 జిల్లాల నుండి వచ్చిన యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్

# సాగునీటి ప్రాజెక్టులను గాలికొదిలేశారు

- నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగునీటి ప్రాజెక్టులను గాలికొదిలేసిందనిజనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ విమర్శించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టులో గేట్లు కొట్టుకుపోవడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని అన్నారు. శ్రీకాకుళంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వం నాలుగున్నరేళ్ల పాలనలో పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. ఇసుక, మద్యం, విద్య, పశుసంవర్ధక శాఖ ఇలా ఎందులో చూసినా రూ.వేల కోట్ల అవినీతి బయటపడుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి బంధువు, మాజీ మంత్రి నెల్లూరు జిల్లాలో పెద్దఎత్తున భూముల లావాదేవీల్లో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్నివిధాలుగా దివాళా తీయించారని ఆరోపించారు. వీటన్నింటికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సంక్షేమం పేరిట ప్రజలపై భారాలు మోపుతున్నారని తెలిపారు. నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయని, వచ్చే ఎన్నికల్లో వైసిపికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు.

# 17న 'మూడు రాజధానుల' పై నిరసన

- నాలుగేళ్లు నిండిన సందర్భంగా వర్సిటీ ఎదుట భారీ సభ
- తుళ్లూరు సమావేశంలో రాజధాని రైతులు వెల్లడి


తుళ్లూరులో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న జెఎసి నాయకులు

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో మూడు రాజధానులు ప్రకటన చేసి డిసెంబర్ 17 నాటికి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు అమరావతి సమన్వయ కమిటీ, అమరావతి జెఎసి నాయకులు తెలిపారు. తుళ్లూరులోని జమ్ముల నరసింహారావు కాంప్లెక్స్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 2019 అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటన చేసిన రోజునే అమరావతి మహోద్యమానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రభుత్వ నిర్బంధాన్ని, ప్రకృతి వైపరీత్యాలను అధిగమించి ఉద్యమాన్ని రాజధాని గ్రామాల్లో నిరాటంగా కొనసాగిస్తున్నామన్నారు. ఈ క్రమంలో యూనివర్సిటీ ఎదుట బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నామని, నాయకులు ధనేకుల రామారావు, పువ్వాడ సుధాకర రావు, బెల్లం కొండ నరసింహారావు తెలిపారు. అన్ని గ్రామాల్లో రైతులు, అసైన్డ్ రైతులు, మహిళలు సభకు భారీగా హాజరు కావాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ మాట తప్పి మడమ తిప్పి ప్రభుత్వం మూడు రాజధానుల ప్రకటన చేసిందని, అమరావతి ఉద్యమకారులపై అక్రమ కేసులు, నిర్బంధాలతో అణచివేత చర్యలకు పాల్పడిందని అన్నారు.

17న జరిగే సభకు టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు హాజరవ్వాలని కోరారు. సమావేశంలో రాజధాని ప్రాంతంలోని రైతులు, రైతు కార్మికులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


రైతు కవనం సభలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

## మోడీ పాలనలో వ్యవసాయ రంగం పతనం

- రైతు కవనంలో వి.కృష్ణయ్య

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందని, మోడీని ఓడించకుంటే మరింత పతనం దిశగా వెళ్లే అవకాశం ఉందని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య తెలిపారు. కర్నూలులోని కార్మిక కర్షక భవన్‌లో ఆదివారం సాహితీ స్రవంతి, ఎఐకెఎస్ సంయుక్తంగా రైతుకవనం నిర్వహించారు. సిపిఎం జిల్లా అధ్యక్షులు ఆవుల బసప్ప అధ్యక్షతన జరిగిన ఈ సభలో కృష్ణయ్య మాట్లాడుతూ.. మోడీ సంస్కరణల వల్ల వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గి ఉత్పత్తి ఖర్చులు పెరిగాయన్నారు. 85 శాతం రైతులు ఐదెకరాలలోపు వారేనని తెలిపారు. 2014 ఎన్నికల సందర్భంగా నరేంద్ర మోడీ రైతులకు ఉత్పత్తి ఖర్చులకు 50 శాతం అదనంగా వచ్చేటట్లు చేస్తానన్నారని, వ్యవసాయ బీమా చేస్తానని హామీ ఇచ్చి రైతులను మోసం చేశారన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు రైతులకు అందుబాటులో లేవని తెలిపారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లేవని, వ్యవసాయ రంగం కార్పొరేట్ కంపెనీల మయం కానుందని తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని రైతు సంఘాల ఆధ్వర్యంలో త్వరలో విజయవాడలో రైతు సదస్సు నిర్వహించనున్నామని చెప్పారు. అందరూ ఐక్యమై వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించాల్సిన అవసరముందన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ మాట్లాడుతూ.. వ్యవసాయరంగంపై కేంద్రం పెత్తనమేమిటిని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా 1990 నుండి ఇప్పటి వరకు 3 లక్షల మంది రైతులు అత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ప్రతి రోజు 28 మంది రైతులు అత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకష్ణ మాట్లాడుతూ.. అన్నదాతను కాపాడుకోకపోతే భవిష్యత్తు ఉండదన్నారు. జనకవనంలో సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి అవుల చక్రపాణియాదవ్, కవులు కల్యాణదుర్గం స్వర్ణలత, పార్వతయ్య, సలీం, పులిచేరి మహేష్ పానుగంటి చంద్రయ్య, జంగం స్వయం ప్రభలు కవితలు చదివారు. సమావేశంలో ప్రజానాట్యమండలి నాయకులు బసవరాజు రైతు చైతన్యగీతాలు పాడారు. సమావేశంలో డివైఎఫ్ఐ నాయకులు నాగేష్, ఐలు నాయకులు వెంకటస్వామి, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ జెయన్ శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కమిటీ

- కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ విజ్ఞప్తి
- సిఎం దృష్టికి తీసుకెళ్తా : మల్లాది విష్ణు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి అధికారుల కమిటీని నియమించి, నిర్ణీత కాలపరిమితిలోపు పరిష్కరించాలని కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎపి జెఎసి అమరావతి అనుబంధం) ప్రథమ మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. విజయవాడలోని గాంధీనగర్ జింఖానా గ్రౌండ్‌లో ఆదివారం ఈ మహాసభ అసోసియేషన్ అధ్యక్షులు కె సుమన్ అధ్యక్షతన జరిగింది. సభకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ ఆప్కాస్ పేరుతో ఒక రక్షణ వలయాన్ని ఏర్పాటుచేసి, దళారుల వ్యవస్థ నుంచి రాష్ట్ర ప్రభుత్వం విముక్తి చేసిందన్నారు. ఉద్యోగులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను సిఎంతోపాటు మంత్రివర్గ ఉప సంఘం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గత 25 ఏళ్లుగా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ కాంట్రాక్టు ఉద్యోగుల తరహాలో కనీస సర్వీస్ కటాఫ్ పెట్టి అందరికీ మినిమం టైమ్‌స్కేల్ (ఎంటిఎస్) వర్తింపజేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హెచ్ఆర్ పాలసీని అమలు చేసి భద్రత కల్పించాలన్నారు. ఈ మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర్‌రావు, ఎపిజెఎసి అమరావతి రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ టివి ఫణి పేర్రాజు, అల్లం సురేష్‌బాబు, ఎపి జెఎసి అమరావతి మహిళా విభాగం రాష్ట్ర ఛైర్‌పర్సన్ పి లక్ష్మి, ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జివి నరసయ్య, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ఆర్లయ్యతోపాటు పలు సంఘాల నాయకులు ప్రసంగించారు.

సభ ప్రారంభానికి ముందు కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షులుగా కె సుమన్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి గురునాథ్, వైస్ ప్రెసిడెంట్లుగా జి సంపత్, ఎస్‌వి కృష్ణ, జె మెర్సీకుమారి, కెజె రామ్, జనరల్ సెక్రటరీగా అల్లం సురేష్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి వేణు, సెక్రటరీలుగా ఎం మధుబాబు, పి కిషోర్‌కుమార్, పి సుధీర్‌కుమార్, సిహెచ్ రమణమూర్తి, పి విజయభారతి, ఎం రామకృష్ణ, కోశాధికారిగా యు అనిల్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

**ఇన్‌సాల్వెన్సీ & బ్యాంక్రప్టసీ కోడ్, 2016 క్రింద అమ్మకపు ప్రకటన.**
**మెసర్స్ ఎమ్‌పీ సుగర్స్ & కెమికల్స్ లిమిటెడ్- ఇన్ లిక్విడేషన్**
**(సిఐఎన్: ఎల్24110ఎపి1988పిఎల్‌సి009291)**
రిజిస్టర్డు ఆఫీసు: అయ్యపరెడ్డిపాలెం, నాయిడుపేట్ మండలం, నెల్లూరు జిల్లా, ఎ.పి.524126, ఇండియా
లిక్విడేటర్ కార్యాలయం: ఆఫీసు నం.58, 3వ క్రాస్, వినాయక్ నగర్, హెబ్బల్, బెంగళూరు 560024.
మొబైల్: 9845002523 / 080 2390 2344, ఇ-మెయిల్: plan@psri.in; ip.empee@gmail.com

**ఇన్‌సాల్వెన్సీ & బ్యాంక్రప్టసీ కోడ్, 2016 క్రింద ఇ-వేలం**
ఇ-వేలం తేది& సమయం: **సోమవారం, 8 జనవరి 2024 మ॥ 03:00గం.లు నుండి సా॥ 05:00గం.లు**
**(ప్రతిసారి 10 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)**

తేది 10.02.2023 నాటి ఉత్తర్వు ఆధారంగా, గౌరవ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, అమరావతి బెంచ్ వారిచే నియమించిన, లిక్విడేటర్ ద్వారా లిక్విడేటర్ ఎస్టేట్ యొక్క లిక్విడేషన్ ఫార్మింగ్ పార్ట్‌లో **మెసర్స్ ఎమ్‌పీ సుగర్స్ & కెమికికల్స్ లిమిటెడ్** (కార్పొరేట్ డెటర్) యొక్క ఆస్తుల అమ్మకం. క్రింది సంతకందారుచేత ఇ-వేలం ప్లాట్‌ఫారం నేషనల్ ఇ-గవర్నెన్స్ సర్వీసెస్ లిమిటెడ్ (ఎన్ఇఎస్ఎల్) ద్వారా **"ఏది ఎక్కడ ఎలా ఉన్నది, అది అక్కడ అలాగే ఉంటుంది"** ప్రాతిపదికన **https://nesl.co.in/auction-notices-under-ibc/** గా లింక్ కలిగియుండుట ద్వారా అమ్మకం చేపట్టబడుతుంది.

| బ్లాక్ | ఆస్తుల వివరాలు | రిజర్వు ధర (రూ.లు కోట్లలో) | ధరావత్తు మొత్తం (రూ. కోట్లలో) | బిడ్ పెంపుదల విలువ (రూ. కోట్లలో) |
|---|---|---|---|---|
| 1 | సంబంధించినదిగా ముందుకుసాగుతూ కంపెనీ/ కార్పొరేట్ డెటర్ సేకరణకు ఒక ఆప్షన్‌తో తమిళనాడు, తిరునెల్‌వెల్లి జిల్లా, అంబసముద్రం, ముక్కూదల్ గ్రామం వద్దగల ల్యాండ్ (సుమారు 240 ఎకరాలు విస్తీర్ణం) కలిగియున్న అంబసముద్రం యూనిట్ అమ్మకం. **సంబంధించినట్లుగా (ఇతర ఆస్తులుతోసహా కొంత ఎంటిల్‌మెంట్స్ & అక్షనబుల్ క్లైమ్, ప్రాసెస్ మెమోరండంలో వివరాలు అందుబాటులో ఉంటాయి) పై ఆస్తుల భాగంగా సేకరించిన ఆప్షన్‌తోసహా.** | 17.00 | 1.70 | 0.10 |

**ముఖ్యమైన సూచనలు:**
1. పరిశీలన తేది: **27 డిసెంబర్ 2023 నుండి 4 జనవరి 2024.**
2. ఇ-వేలం ద్వారా ఆస్తుల అమ్మకం ఖచ్చితంగా **"ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ఉంటుంది"** ప్రాతిపదికన నిర్వహించబడుతుంది.
3. ఈ ఆహ్వానం ఆసక్తిగల బిడ్డరుదారులుకు మరియు ఇది అమ్మకంకు సంబంధించి లిక్విడేటర్ లేదా కంపెనీ యొక్క భాగం పై కట్టుబడియుండదు. లిక్విడేటర్ వేలం యొక్క ఏదేని స్థితిలో ఏ కారణంచూపకుండానే లేదా ఏదేని ముందస్తు ప్రకటన ఇవ్వకుండానే ఏదేని బిడ్‌ను తిరస్కరించుటకు హక్కులు కలిగియుంటూ మరియు ప్రక్రియలో అతని అభిప్రాయం వద్ద ఇ-వేలం యొక్క సమయపాలనతోపాటు నియమాలు& నిబంధనలు ఏవేనిని పొడిగించు/ తగ్గించు/రద్దుచేయు మరియు/లేదా ఆధునీకరించు, తీసివేయు అధికారాలను లిక్విడేటర్ కలిగియుంటారు.
4. ధరావత్తు దాఖలు మరియు ప్రక్రియలో పాల్గొనుటకు ముందు ఇ-వేలం ప్రక్రియ సమాచార పత్రం నుండి అన్ని నియమాలు& నిబంధనలు పేర్కొన్నట తప్పనిసరి. ఆస్తులు, ఆన్‌లైన్ ఇ-వేలం యొక్క నియమ& నిబంధనలు, బిడ్ ఫారం, అర్హతా నియమావళి, బిడ్డర్లుచే ప్రకటన, కోరిన ధరావత్తు మొ॥న వంటి వివరాలు కలిగియున్న పూర్తి ఇ-వేలం ప్రక్రియ సమాచార పత్రం **https://nesl.co.in/auction-notices-under-ibc/** మరియు **www.psri.in/escl/** వద్ద అందుబాటులో ఉంటాయి.
5. అంబసముద్రం యూనిట్‌తోసహా సంబంధితగా ముందుకుసాగుటగా కార్పొరేట్ డెటర్ యొక్క అంబసముద్రం యూనట్ లేదా కార్పొరేట్ డెటర్ యొక్క అమ్మకంను పరిశీలనతో స్టాక్‌హోల్డర్స్ కన్సల్టేషన్ కమిటీతో లిక్విడేటర్ ఇన్ కన్సల్టెషన్ సరైన హక్కులు కలిగియుంటారు. తదుపరి సందేహాల నివృత్తి కొరకు ఇ-వేలం ప్రక్రియ సమాచార పత్రంకు దయచేసి చూడండి.
6. నిర్దేశించిన ఫార్మేట్స్‌లో ఇ-మెయిల్ ద్వారా బిడ్‌కు సంబంధించిన పత్రాలు దాఖలు మరియు ఒరిజినల్స్ యొక్క హార్డ్ కాపీలు లిక్విడేటర్ ఆఫీసుకు పంపవలెను.
7. ఆసక్తిగల బిడ్డరుదారులు వారి బిడ్ దాఖలుచేయుటకు ముందు, ఆస్తి యొక్క టైటిల్, స్థానిక పన్నులు బకాయిలు, విద్యుత్ మరియు నీటి చార్జీలు, మెయింటేనెన్స్ చార్జీలు, ఏవేని వాటికి సంబంధించి స్వంత ఖర్చులతో వారి స్వతంత్ర విచారణలు చేసుకోవలెను మరియు ఆస్తి ని పరిశీలించి, వారంతట వారుగా సంతృప్తిచెందవలెను.
8. ఈఓఐ దాఖలుచేయుటకు చివరి తేది, అన్ని బిడ్ పత్రాలతోపాటు రిఫండబుల్ పార్టిసిపేషన్ ధరావత్తు- **26.12.2023.**
9. ధరావత్తు దాఖలుచేయుటకు చివరి తేది **06.01.2024న లేదా ముందుగా.**
10. **ఇ-వేలం తేది& సమయం 08.01.2024న మ॥ 3:00గం.లు నుండి సా॥ 5:00గం.లు వరకు ప్రతిసారి 10 నిమిషాల అపరిమిత పొడిగింపుతో.**
11. ఆసక్తిగల దరఖాస్తుదారులు ఎవరైతే ధరావత్తును డిపాజిట్‌చేశారో మరియు లాగిన్ ఐడిని క్రియేట్‌చేయుటలో మరియు పాస్‌వర్డ్‌ను పొందుటలో కావలసిన సహాయసహకారాల కొరకు లిక్విడేటర్ వారి ఆఫీసును 080-2390 2344 పై **ip.empee@gmail.com** లేదా **plan@psri.in** వద్ద ఇ-మెయిల్ ద్వారా సంప్రదించవచ్చును.

**తేది: సోమవారం, 11 డిసెంబర్, 2023**
**ప్రదేశం: బెంగళూరు**

**పంకజ్ శ్రీ వాస్తవ**
**లిక్విడేటర్- ఎమ్‌పీ సుగర్స్ & కెమికల్స్ లిమిటెడ్**
ఆఫీసు నం.58, 3వ క్రాస్, వినాయక్ నగర్, హెబ్బల్, బెంగళూరు-560024.
రిజిస్ట్రేషన్ నం.: ఐబిబిఐ/ఐపిఎ-001/ఐపి-పి00245/2017-18/10474.
ఎఎఫ్ఎ వాలిడ్ 16.11.2024 వరకు
**080 2390 2344/ip.empee@gmail.com/psri@live.com/www.psri.in/escl**